సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 8 । జూన్ । 2024



కనకమ్మకు క్షీరాభిషేకం
విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేక సేవ నిర్వహించారు. 8లో



ఘనంగా ఆర్జిత సేవలు
సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. 8లో



ఉత్తమ సేవలకు అభినందన
సార్వత్రిక ఎన్నికల్లో విజయవంతంగా విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందికి ఎస్ఈబీ కమిషనర్ అవార్డులు అందజేశారు. 8లో

న్యూస్‌రీల్

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడండి

- పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి పిలుపు
- 9,10,11 తేదీల్లో ప్రత్యేక శిబిరం

పాడేరు : ఏజెన్సీలో రక్తదానం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి పిలుపునిచ్చారు. అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేక చాలా మంది ప్రజల తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఈనెల 9,10,11 తేదీల్లో పాడేరులో మోదకొండమ్మ జాతర సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చే వారు 9440933450లో సంప్రదించాలని ఆమె కోరారు.

ఏపీఆర్‌డీసీ డైరెక్టర్ పదవికి బత్తుల రాజీనామా

అడ్డతీగల: ఆంధ్రప్రదేశ్ రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి శుక్రవారం రాజీనామా చేసినట్లు బత్తుల సత్యనారాయణ తెలిపారు.ఈ మేరకు తన రాజీనామా లేఖ ప్రతిని ఏపీఆర్‌డీసీ ఎండీ ఎల్.శ్రీనివాసరెడ్డికి పంపించినట్లు ఆయన చెప్పారు.

కాకినాడకు బస్సు సర్వీసులు ప్రారంభం



కాకినాడకు ఏర్పాటుచేసిన ఆర్టీసీ సర్వీసు

వై.రామవరం: మండల కేంద్రం వై.రామవరం – కాకినాడకు శుక్రవారం నాలుగు బస్సు సర్వీసులు ప్రారంభించినట్లు అడ్డతీగల ఆర్టీసీ బస్ స్టేషన్ కంట్రోలర్ టి.అచ్చారావు తెలిపారు. ఇప్పటివరకు వై.రామవరం నుంచి ఏలేశ్వరం వరకు ఉండే సర్వీసులను కాకినాడకు పొడిగించినట్లు ఆయన తెలిపారు. ప్రతీరోజు ఉదయం 7.30, 9.30, మధ్యాహ్నం గం.12.45, 2.45 లకు వై.రామవరం నుంచి ఈ సర్వీసులు కాకినాడ బయలుదేరుతాయన్నారు. అలాగే కాకినాడలో ప్రతీ రోజు ఉదయం 7.45, 9.45, మధ్యాహ్నం గం.12.30, 2.40లకు బయలుదేరి వై.రామవరం వెళతాయని ఆయన తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన ఈసర్వీసులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విలువ ఆధారిత ఉత్పత్తులతో మంచి ఆదాయం



పనసతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త దివ్యసుధ

చింతపల్లి రూరల్: పనసతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త దివ్యసుధ అన్నారు. మండలంలోని సిరిపురంలో లంబసింగి ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌లో శుక్రవారం పనసతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సహజంగా పండే పనసలో మంచి పోషకాలు ఉంటాయన్నారు. పనసకు విలువ ఆధారిత జోడించి పచ్చడి,చిప్స్,జామ్,పనస జూస్ తయారీ ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవో సభ్యులు ఇందిర, సరోజ పాల్గొన్నారు.

శ్రీవిద్య కోర్సు ప్రారంభం



కోర్సు నేర్చుకునేందుకు వచ్చిన విద్యార్థులు

నక్కపల్లి (అనకాపల్లి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీ దేవి పీఠంలో శ్రీవిద్య కోర్సును శుక్రవారం ప్రారంభించారు. తెలుగు భాషలో ఈ నెల 7వ తేదీ నుంచి 10 తేదీ వరకూ నాలుగు రోజుల పాటు ఈ కోర్సు నేర్పించనున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తెలుగు విద్యార్థులకు ముందుగా శ్రీగురు పాదుకా మంత్రోపదేశం చేసి శ్రీగణపతి,బాల,చండీ మంత్రోపదేశాలు చేశారు. నాలుగు రోజుల్లో ప్రాథమిక అంశాలైన మంత్ర సాధన,యంత్ర పూజలు,తర్పణాలు తియరీతో పాటు ఆచరణాత్మకంగా నేర్చుకొంటారన్నారు.

అత్యుత్సాహం.. ఆదమరిస్తే ప్రమాదం

మన్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పరవళ్లుతొక్కుతూ కనువిందు చేస్తున్న జలపాతాల వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. వీటిని తిలకించేందుకు వస్తున్న పర్యాటకులకు జలపాతాల వద్ద పరిస్థితులపై అంచనా లేక ప్రమాదాలకు గురవుతున్నారు. కొంతమంది ఈతకు దిగి.. మరికొంతమంది సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ జారిపడి ప్రాణాలు కోల్పోతున్నారు. వారిపై ఆధారపడిన కుటుంబాలకు తీరని వేదన మిగులుస్తున్నారు. దీంతో విహారయాత్రలు కాస్త విషాదంగా మారుతున్నాయి.

- జలపాతాల వద్ద ప్రమాదకర పరిస్థితులు
- ఈతకు దిగి కొందరు.. సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ మరికొందరు
- పట్టని అధికారుల హెచ్చరికలు
- విషాదంగా మారుతున్న విహారయాత్రలు



సీతపల్లివాగులో మృతదేహాల కోసం గాలింపు చర్యలు (ఫైల్)



పెదబయలు మండలంలో పిట్టలబొర్రా జలపాతం వద్దకు బలహీనంగా ఉన్న కర్రల నిచ్చెన పైనుంచి వెళ్తున్న సందర్శకులు

అనంతగిరి: జలపాతాల వద్ద ప్రమాదాల నివారణకు పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నా సందర్శనకు వచ్చేవారు అత్యుత్సాహం కారణంగా ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ఈ ప్రాంతాల్లోని జలపాతాల వద్ద లోతు ఎక్కువగా ఉండటమే కాకుండా ఊబి, బండరాళ్ల కారణంగా కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. జలపాతంలో పడి గల్లంతైన వారి ఆచూకీ రెండు మూడు రోజుల వరకు లభ్యం కావడం లేదు. దీంతో మృతుల కుటుంబాలు, అధికారులకు అవస్థలు తప్పడం లేదు.

సొరంగం పూడ్చివేత

డుంబ్రిగుడ మండలంలో చాపరాయి జలపాతం అరకు–పాడేరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నందున పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈతకు దిగిన వారు ప్రమాదానికి గురై సొరంగంలో కూరుకుపోయేవారు. ఇలా సుమారు 25 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాలకు కారణమైన సొరంగం వద్ద అధికారులు బండరాళ్లను పేల్చి పూడ్చివేయడంతో పరిస్థితి మెరుగుపడింది.. అయినప్పటికీ స్నానానికి దిగిన వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

గాదిగుమ్మితో చెలగాటం వద్దు

కొయ్యూరు మండలంలోని గాదిగుమ్మి జలపాతం వద్ద ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా ప్రాణాలు మీదకు తెచ్చుకున్నట్టే. ఈ ప్రాంతంలో జారిపడిన వారు ఇప్పటివరకు బతికి బయటపడిన దాఖల్లాలేవు. ఇక్కడ నీటి ప్రవాహం భూమట్టానికి సమాంతరంగా ఉంటూ బండరాళ్లపైనుంచి జారిపడుతుంది. సరదాగా దిగేవారు జారిపడి కొట్టుకుపోయి ఊబిలో కూరుకుపోయి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక్కడ కూడా గల్లంతైన వారి మృతదేహాలు వెంటనే లభ్యం కావడం లేదు. ఇప్పటివరకు సుమారు 40 మంది ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు.

ముందుకు వెళ్తే గల్లంతే..

ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలో సుమారు 2600 అడుగుల ఎత్తునుంచి డుడుమ జలపాతం పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాల్లో స్నానానికి దిగిన వారు జారిపడి ప్రాణాలు కోల్పోతున్నారు. సుమారు ఆరుగురు వరకు మృత్యువాత పడ్డారు. అప్రమత్తమైన ఒడిశా ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టింది. పర్యాటకులు ముందుకు వెళ్లకుండా సిమెంటు స్తంభాలతో రక్షణ చర్యలు చేపట్టింది. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసింది.

ఈతకు దిగి మృత్యువాత..

హుకుంపేట మండలంలోని తీగలవలస పంచాయతీ జెండాకొండమార్గంమధ్యలో గుడ్డిగుమ్మి జలపాతం ఈ మధ్యనే వెలుగుచూసింది. చుట్టూ దట్టమైన అటవీప్రాంతంలో జాలువారుతున్న ప్రవాహ అందాలను తిలకించేందుకు వచ్చిన ముగ్గురు యువకులు ఈతకు దిగి ఇటీవల ప్రాణాలు కోల్పోయారు.

మృతుల్లో ఎక్కువమంది యువతే..

జలపాతాల వద్ద ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన వారిలో 18 నుంచి 35 ఏళ్లలోపు వారే ఎక్కువమంది ఉన్నారు. ఈ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసిన ఏమాత్రం లక్ష్యం పెట్టడం లేదు. బండరాళ్లకు నాచు పట్టడం వల్ల జారిపడి ప్రాణాలు కోల్పోతున్నారు. జలపాతాల అందాలను దూరం నుంచి తిలకించాలని.. వాటిలో దిగి ప్రమాదాల బారిన పడొద్దని పోలీసులు సూచిస్తున్నా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.



ఉరకలేస్తున్న డుడుమ జలపాతం

విషాదంగా విహారం..

జలపాతాల వద్ద పరిస్థితులపై అవగాహన లేక ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయి తీవ్ర విషాదం మిగుల్చుతున్నారు. కొన్ని సందర్భాల్లో అత్యుత్సాహం కూడా ప్రమాదాలకు దారితీస్తోంది.

స్నేహితులతో స్నానానికి దిగి..

19–7–2020: పొల్లూరు జలపాతంలో ఈతకు దిగిన ఎటపాక మండలం కేఎస్‌పురానికి చెందిన ఎస్.రాజేష్(21) ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. పదిమంది స్నేహితులతో కలిసి జలపాతం వద్దకు వెళ్లి, స్నానానికి దిగాడు. ఊబిలో కూరుకుపోయిన రాజేష్‌ను బయటకు తీసినా ప్రయోజనం లేకపోయింది.

'సోకులేరు' సందర్శనకు వచ్చి..

27–9–2022: సోకులేరు వాగులో దిగిన బాపట్ల జిల్లా వేటపాలెం శ్రీహనుజ్జ పాఠశాల విద్యార్థినులు సువర్ణ కమల(15), సూరిన గీతాంజలి(14),గుమ్మడి జయశ్రీ(15) ప్రాణాలు కోల్పోయారు. భద్రాచలంలో దైవ దర్శనానికి వచ్చిన సుమారు 20 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు సోకులేరు వాగు వద్దకు సందర్శన నిమిత్తం వచ్చారు. వాగులో దిగిన వారిలో ముగ్గురు గల్లంతయ్యారు.

వాగులో వ్యాన్ డ్రైవర్..

1–05–2024: చింతూరు ఘాట్ తులసిపాక సమీపంలోని వ్యూపాయింట్ వద్ద వాగులో చేతులు కాళ్లు శుభ్రం చేసుకునేందుకు దిగిన ఎటపాక మండలం నందిగామకు చెందిన వ్యాన్ డ్రైవర్ బి.కొండయ్య(40) గల్లంతయ్యాడు.





సీతపల్లివాగులో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన రాజ్‌కుమార్, అవినాష్ (ఫైల్)

గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది.

పోషించే దిక్కును కోల్పోయి..

3–5–2024: ఐ.పోలవరం జంక్షన్‌కు సమీపంలో సీతపల్లివాగులో ఈతకు దిగిన కాకినాడ జిల్లా సామర్లకోట గ్రామానికి చెందిన వీ.రాజ్‌కుమార్(29), వి.అవినాష్(27) గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. నలుగురు స్నేహితులతో వచ్చిన వీరు వంతెన వైపు స్నానానికి దిగి ప్రమాదానికి గురయ్యారు. వీరిద్దరు పెయింటర్లుగా పనిచేస్తూ కుటుంబాలకు ఆసరాగా ఉండేవారు. వీరి మృతితో ఆయా కుటుంబాలు పోషించే దిక్కును కోల్పోయాయి.



డుడుమ జలపాతం వద్ద ప్రమాదాల నివారణకు ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేసిన రక్షణ

దిగితే అంతే సంగతి

సీలేరు ధారాలమ్మ జలపాతం వంద అడుగుల ఎత్తుల్లోంచి జాలువారుతుంది. అమ్మవారి గుడి వద్ద నుంచి జలపాతం అందాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అయితే అక్కడికి వెళ్లి జలపాతంలోకి దిగిన వారు ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారు. ఇప్పటివరకు సుమారు 20 మంది మృత్యువాత పడ్డారు.

గల్లంతైతే ప్రాణం పోయినట్టే..

మోతగూడెం ప్రాంతంలోని పొల్లూరు జలపాతానికి తెలుగురాష్ట్రాల్లో గుర్తింపు పొందింది. ఈ ప్రాంతంలో సినిమాలు చిత్రీకరిస్తుంటారు. అందువల్ల ఇక్కడి అందాలను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ జలపాతంలో స్నానాలకు దిగిన వారిలో సుమారు 35 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. బండరాళ్లతోపాటు ఊబి ఉన్నందున గల్లంతైన వారి ఆచూకీ వెంటనే లభ్యం కావడం లేదు. మృతదేహాలు వెలికి తీసేందుకు అధికారులు, కుటుంబ సభ్యులకు శ్రమ తప్పడం లేదు. ఈ ప్రాంతానికి సమీపంలోని సోకులేరు వాగు వద్ద ఇదే పరిస్థితి.

మృత్యుకుహరంగా..

రంపచోడవరం మండలం ఐ.పోలవరం దగ్గర నున్న సీతపల్లివాగు ప్రమాదభరితంగా మారింది. వాగులో దిగితే ప్రాణాలు పోయినట్టే. ఇటీవల కాలంలో అధిక సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. లోతు ఎక్కువగా ఉన్నందున ప్రమాదాలకు గురవుతున్నారు. సుమారు 20 మంది వరకు మృత్యువాత పడ్డారు.

దూకుడు వద్దు

జలపాతాల వద్ద దూకుడుగా వ్యవహరించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినా పట్టించుకోవడం లేదు. అనంతగిరి మండలంలోని సరియా జలపాతం వద్ద బండరాళ్లను బ్లాస్ట్ చేసి ప్రమాదాలు నివారించగలిగాం. కొత్తపల్లి జలపాతం వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇక్కడి పరిస్థితులపై అవగాహన లేక ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.

– కె.ధీరజ్, ఏఎస్పీ, పాడేరు

మోదమ్మ జాతరను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత, చిత్రంలో ఎస్పీ తుహిన్‌సిన్హా, పీవో తదితరులు



హాజరైన అధికారులు, ఉత్సవ, ఆలయ కమిటీ ప్రతినిధులు

- కలెక్టర్ విజయ సునీత
- అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సమావేశం

సాక్షి, పాడేరు: ఈనెల 9,10,11తేదీల్లో నిర్వహించనున్న ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లి జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.విజయసునీత ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె అధికారులు,ఉత్సవ కమిటీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. అధికారులు,ఉత్సవ కమిటీ ప్రతినిధులంతా సమన్వయంతో పనిచేసి జాతరను ఘనంగా నిర్వహించాలని కోరారు. క్లోరినేషన్ చేసిన తాగునీటిని ట్యాంకర్ల ద్వారా ప్రజలకు పంపిణీ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వంట గ్యాస్‌ను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలన్నారు.అదనపు కార్మికులను నియమించి పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు.రవాణా సమస్య తలెత్తకుండా అదనంగా ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఘాట్‌రోడ్డులో భారీ వాహనాలను నిషేధించామని తెలిపారు. ఇందుకు తగ్గట్టుగా పోలీసు,ఆర్‌అండ్‌బీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ వాహనాలు ఓవర్‌లోడ్‌తో సర్వీసు చేయకుండా నియంత్రించాలని రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారులను ఆదేశించారు. ఉత్సవాల్లో 750 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. మోదకొండమ్మతల్లి ఆలయం, సతకంపట్టుతో పాటు ప్రధాన జంక్షన్లలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, కంట్రోల్ రూమ్,సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పాడేరు ఏఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ విశాఖ నుంచి వచ్చే వాహనాలను మండల పరిషత్ కార్యాలయ సమీపంలో, చింతపల్లి నుంచి వచ్చే వాహనాలను సెయింటాన్స్ కాన్వెంట్ వద్ద, అరకులోయ,పెదబయలు నుంచి వచ్చే వాహనాలను తలారిసింగి పాఠశాల సమీపంలో పార్కింగ్‌కు ఏర్పాటుచేశామన్నారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్వో పద్మావతి, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీడీ కొండలరావు,ఆర్‌డబ్ల్యూఎస్,ఆర్‌అండ్‌బీ ఈఈలు లీలాకృష్ణ,బాలసుందరబాబు, డీఎల్పీవో కుమార్, ఉత్సవ కమిటీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు, కె.వెంకటరమణ, వై.శ్రీను,టి.ప్రసాద నాయుడు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్

రాజవొమ్మంగి: స్థానిక శ్రీఅల్లూరిసీతారామరాజు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వివిధ తరగతుల్లో ప్రవేశం, సీట్ల భర్తీకి ప్రత్యేక డ్రైవ్ జరుగుతోంది. ఇంటింటికి వెళ్లి పిల్లల్ని పాఠశాలలో చేర్పించమని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు, సిబ్బంది అవగాహన కలిస్తున్నారు. శుక్రవారం జరిగిన ఈ తరహా కార్యక్రమంలో 5, 6 తరగతుల్లో చేర్పించేందుకు ఐదుగురిని గుర్తించామని హెచ్ఎం బీవీ గోపాలకృష్ణ తెలిపారు. జీపీఎస్, ఎంపీపీ పాఠశాలల్లో 5వ తరగతి పాసైన వారిని జెడ్పీ పాఠశాలలో 6వ తరగతిలో చేర్పిస్తున్నామని ఆయన వివరించారు. ఈ పాఠశాలలో 3వ తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 600 మంది చదువుతున్నారు. పూర్తి స్థాయిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఇదే పాఠశాల ప్రాంగణంలోని పది ప్లస్ ఉమన్స్ జూనియర్ కళాశాలలో చేర్పించేందుకు కూడా కృషి చేస్తున్నామని తెలిపారు.

వరదలపై ముందస్తు చర్యలు

- విలీన మండలాల్లో 60 పునరావాస కేంద్రాలు
- చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: రాబోయే వరదలు, భారీ వర్షాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. దీనిలో భాగంగా చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో 60 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. పునరావాస కేంద్రాలు, వరద సహాయక చర్యల పర్యవేక్షణ నిమిత్తం డివిజన్, మండలస్థాయి అధికారుల ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో కూడిన 12 బృందాలను కూడా ఏర్పాటు చేసినట్టు ఆయన వివరించారు. చింతూరు మండలంలో ఏజీకొడేరు, ఉలుమూరు, మల్లెతోట, నర్సింగపేట, ముకునూరు, తిమ్మిరిగూడెం, చూటూరు, కల్లేరు, కుయిగూరు, మామిళ్లగూడెం, కుమ్మూరు, చింతూరు, లక్ష్మీపురం, చట్టి, వీరాపురంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేస్తామని తెలిపారు. కూనవరం మండలంలో కూనవరం, జగ్గవరం, పైడిగూడెం, కొండాయిగూడెం, అయ్యావారిగూడెం, గొమ్ముగూడెం, చూచిరేవులగూడెం, కుమారస్వామిగూడెం, మర్రిగూడెం, చూచిరేవుల, లేళ్లవాయి, నర్సింగపేట, పొట్లవాయిగూడెం, వీఆర్ పురం మండలంలో వడ్డిగూడెం, ధర్మతాళ్లగూడెం, వీఆర్‌పురం, రేఖపల్లి, రాజుపేట, ఉమ్మడివరం, అన్నవరం, గుర్రంపేట, చినమట్టపల్లి, సున్నంవారిగూడెం, ఎటపాక మండలంలో తాళ్లగూడెం, మేడువాయి, కొల్లుగూడెం, పురుషోత్తపట్నం, గుండాల కాలనీ, ఎర్రగుంట తదితర గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామని పీవో తెలిపారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

- పెదబయలులో ఇళ్లు, విద్యుత్ స్తంభాలపై కూలిన భారీ వృక్షాలు
- విద్యుత్ సరఫరాపై ప్రభావం
- లోతట్టు ప్రాంతాలు జలమయం

పెదబయలు: మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. స్థానిక జీసీసీ డిపో సమీపంలో భారీ వృక్షం నేల కూలింది. చెట్టుకొమ్మలు పడటంతో జీసీసీ భవనం పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి. అదే ప్రాంతంలో కారు అద్దాలు దెబ్బతిన్నాయి. స్థానిక స్టేట్ బ్యాంకు సమీపంలో నివాసం ఉంటున్న నల్లా సత్యనారాయణ ఇంటి ఎదురుగా పార్కింగ్ చేసి ఉన్న కారుపై టేకు చెట్టు కొమ్మలు విరిగిపడడంతో కారు ధ్వంసం అయింది. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల, స్టేట్ బ్యాంకు ప్రాంతాల్లో కూలిన టేకుచెట్టును స్థానిక పోలీసులు తొలగించారు. అంబేడ్కర్ పార్కు సమీపంలో చెట్టు కూలడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఐటీడీఏ క్వార్టర్ల సమీపంలో విద్యుత్ లైన్‌పై చెట్టు కొమ్మలు పడి వైర్లు తెగిపోయాయి.దీంతో సుమారు 3 గంటల పాటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.బొండాపల్లి పంచాయతీ ఎగువ బొండాపల్లి గ్రామంలో చెట్టు కూలి పలాసి పండన్న ఇల్లు ధ్వంసమైంది. పెదబయలు లైబ్రరీ వీధిలో సీసీరోడ్డుపై చేరిన వరదనీరు చెరువును తలపించింది.

గాలివాన బీభత్సం

ఎటపాక: మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గౌరిదేవిపేట బీసీ కాలనీలో గాలి దుమారానికి అమరవరపు కుసుమ రేకుల ఇంటిపై చెట్టుపడి ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నల్లకుంట, రాఘవాపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగిపడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.వర్షం వల్ల వాతావరణం చల్లబడటంతో వేసవి తాపం నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.



ఎగువబొండాపల్లిలో ఇంటిపై పడిన చెట్టు



గౌరిదేవిపేటలో ఇంటిపై కూలిన చెట్టు



జీసీసీ డిపో సమీపంలో విరిగి పడిన భారీ వృక్షం



స్టేట్ బ్యాంకు సమీపంలో కారుపై విరిగిపడిన చెట్టు కొమ్మలు



పెదబయలులో గ్రంథాలయం వీధిలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

క్షయ వ్యాధి నివారణే లక్ష్యం

టీబీ విభాగం జాయింట్ డైరెక్టర్ రమేష్



అనంతగిరి పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ రమేష్

అనంతగిరి: క్షయవ్యాధిని 2027 నాటికి పూర్తి స్థాయిలో నివారణే లక్ష్యంగా బీసీజీ వ్యాక్సినేషన్ చేపట్టినట్టు టీబీ విభాగం జాయింట్ డైరెక్టర్ రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన అరకువేలి, అనంతగిరి పీహెచ్‌సీల పరిధిలోని అనంతగిరి, సుంకరమెట్ట పీహెచ్‌సీలను టీబీ యూనిట్లను సందర్శించారు. అనంతరం బీసీజీ వ్యాక్సినేషన్ అమలు తీరును వైద్యాధికారుల నుంచి తెలుసుకున్నారు. క్షయవాధి రాకుండా ఉండేందుకు బీసీజీ టీకాను వేయించుకోవాలన్నారు. ప్రతిఒక్కరు టీకా వేయించుకునేలా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాక్సినేషన్ అధికారి సాధన, వైద్యాధికారి జ్ఞానేశ్వరి, జిల్లా టీబీ సిబ్బంది శేషు, రాజు, నగేష్, వైద్యాధికారి, టీబీ సూపర్‌వైజర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రపంచం.. బంగారు జీవితం

- ఇంటర్‌లో కౌమార దశ
- గాడి తప్పితే జీవితమే గందరగోళం
- చెడు వ్యసనాలను దరి చేర నీయకూడదు
- క్రమశిక్షణతో సాగితే విజయం ఖాయం

కలలు.. ఆశలు.. ఆనందాలు.. హర్షయ్యే సందర్భాలు.. పాఠాలు.. దుమ్మాలు.. అన్నీ కొత్తగా అనిపించేవే. అప్పటి వరకు పాఠశాల చదువు.. ఒక్కసారిగా కళాశాల వాతావరణం.. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం. ఈ క్రమంతో కొత్త పరిసరాలు.. కొత్త వారితో పరిచయాలు, సరికొత్త ఆలోచనలు.. ఇప్పుడిప్పుడే కళాశాలలో అడుగుపెట్టే విద్యార్థికి ఇలా అన్నీ కొత్తగా.. వింతగా అనిపిస్తాయి. టీనేజ్‌లో ఇంటర్మీడియట్ దశ అత్యంత కీలకం. అంతే కాదు జీవితాన్ని మలుపు తిప్పాలన్నా ఇదే ముఖ్యమైన కాలం. అన్నీ తెలిసినట్టే అనిపిస్తుంది. కానీ ఏమీ తెలియని తనం ఆవహిస్తుంది. ఈ రెండింటి మధ్య తేడాను తెలుసుకుంటే జీవితం విజయం వైపు పయనిస్తుంది. కొత్త బంగారులోకం అవుతుంది. ఏ మాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకున్నా.. జీవితం మన చేతుల్లోకి రానంత వెనక్కి వెళ్తుంది. పరాజయం బాటలో నడుస్తుంది.

– విశాఖ విద్య

తొలిసారి ఎదుర్కొన్న పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించామన్న ఆత్మ విశ్వాసం, పాఠశాలను దాటి కళాశాలను చేరామన్న ఉత్సాహం..కొత్త పరిచయాలు, కళాశాల వాతావరణం కలిగించే ఆనందం వెరసి విద్యార్థులకు కళాశాల దశ కొత్త అనుభూతిని అందిస్తుంది. అనువైన గ్రూపు.. ఇష్టమైన సబ్జెక్టులు చదివే తొలి స్వేచ్ఛా దశ ఇదని చెప్పవచ్చు. జీవితంలో కీలక అడుగులన్నీ ఇంటర్‌లోనే పడతాయనడంలో అతిశయోక్తి లేదు. ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ ఫలితాలు సాధించినా.. గాడి తప్పి అధః పాతాళానికి పడిపోయినా ఇక్కడే బీజాలు పడతాయి. హైస్కూల్ విద్యతో మొదలయ్యే కౌమార ప్రాయం ఇంటర్‌లో మరింత పురి విప్పుతుంది. అందుకే ఈ దశ చాలా కీలకం.

చదువుకే తొలి ప్రాధాన్యం : ఇంటర్ విద్యార్థులు ఎన్నో అంశాలకు ఆకర్షితులవుతారు. అయితే ఈ దశలో అందరికీ తొలి ప్రాధాన్యం చదువే కావాలి. జీవితంలో అల్లరి పాలయ్యేలా అల్లరి ఉండకూడదు. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీలకు దుమ్మా కొట్టడం, హీరోయిజం కాదనే విషయాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి. విధిగా తరగతులకు హాజరు కావడం, పాఠ్యాంశాలపై దృష్టి పెట్టడం, అధ్యాపకులిచ్చే నోట్స్‌ను ఎప్పటికప్పుడు నీట్‌గా రాసుకోవడం, పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రణాళిక రూపొందించుకోవడం, స్నేహితులతో కలిసి కంబైన్డ్ స్టడీ చేయడం వంటివి ఉపయుక్తంగా నిలుస్తాయి.

సమయం విలువైనది : ఇంటర్‌లో సెలవు దినాలంటే విద్యార్థులకు పండగే. అయితే వాటిని సద్వినియోగం చేసుకోగలిగితే విద్యార్థి ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించగలడు. ఆయా సమయాల్లో వారు ఎంచుకునే వ్యాపకాలే భవిష్యత్‌ను నిర్దేశిస్తాయి. మనసును, శరీరాన్ని ఉల్లాసపర్చే మంచి క్రీడలు, లైబ్రరీలో పుస్తక పఠనం, స్నేహితులతో సబ్జెక్టులపై చర్చ, శ్రుతిమించని వినోదం వంటివి ఆహ్లాదంతో పాటు జీవితాన్ని ఆనందమయం చేస్తాయి. సివిల్స్, ఇంజినీరింగ్, మెడిసిన్, సాఫ్ట్‌వేర్ వంటి ఏ కోర్సుకైనా తొలి అడుగు పడాల్సింది ఇంటర్‌లోనే.

స్నేహమెంత మధురం

ఇంటర్‌లో చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్దీ అది ఉన్నత భావాలున్న వారితో కుదిరితే జీవితం ప్రభావితం అవుతుంది. లేదంటే ప్రమాదంలో పడుతుంది. పశ్చాత్తాపం పడేలా చేస్తుంది. చదువుపై ఇష్టం, పెద్దలపై గౌరవం, సమాజం మీద అవగాహన, అధ్యాపకులపై సదాభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంలోనే ముందుకు సాగాలి.


ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ (ఫైల్)

వ్యసనాలకు దూరం

జీవితాన్ని ప్రభావితం చేసే ప్రమాదకరమైన వ్యసనాలు ఈ దశలోనే అలవాటయ్యే అవకాశాలు ఉన్నాయి. వాటి నుంచి తప్పించుకోవాలి. సిగరెట్, గుట్కాలు, మద్యం వంటి వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మేలు. ముఖ్యంగా సెల్‌ఫోన్ విద్యార్థుల ప్రగతికి అవరోధంగా మారుతుంది. తరగతి గదుల్లో.. చదువుకునే వేళల్లో అనవసరమైన కబుర్లకు అలవాటు పడేలా చేస్తాయి. పరిచిత, అపరిచిత వ్యక్తులతో చాటింగ్ మోజులో పడొద్దు. నెట్ అలవాటు విషయంలోను విద్యార్థులకు జాగ్రత్త అవసరం. అశ్లీలత వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు ప్రేరేపించే అవకాశం ఉంటుంది. జాగ్రత్తగా ఉండాలి. సినిమాల ప్రభావంతో, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయణమంటూ మనసు కలుషితం చేసుకోవద్దు. దారి తప్పి భావి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. స్నేహితులే లోకంగా అనిపించే వయసులో వారికి అతి ప్రాధాన్యం ఇస్తూ తల్లిదండ్రుల, అధ్యాపకులను నిర్లక్ష్యం చేయకూడదు. తల్లితండ్రులు ఇచ్చే స్వేచ్ఛను దుర్వినియోగం చేయవద్దు.

కాలేజీల్లో కౌన్సిలర్ల ఏర్పాటు



విద్యా సంవత్సరం ప్రారంభమైనందున అకడమిక్ క్యాలెండర్ మేరకు తరగతులు నిర్వహించాలని కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలిచ్చాం. బాలబాలికల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపి వారు చదువులపైనే శ్రద్ధ చూపేలా ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాం. ఇంటర్మీడియట్ ప్రాధాన్యం దృష్ట్యా విద్యార్థులు సత్ప్రవర్తనతో చదువులపైనే దృష్టి పెట్టి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి.

–**పి.మురళీధర్**, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి



పదో తరగతి చదివి ఇంటర్‌లోకి రాగానే ఏదో లోకంలో విహరిస్తారు. విద్యార్థుల్లో ఇది ఎంతమాత్రం సరైంది కాదు. ఇంటర్మీడియట్‌లో బాగా చదువుకుంటే ఉన్నత చదువుల్లో నచ్చిన రంగం వైపు పయనించవచ్చు. షికార్లు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. కాలేజీలకు వెళ్లిన తమ పిల్లల చదువులు ఎలా ఉన్నాయనేది తల్లిదండ్రులు కూడా పర్యవేక్షణ చేయాలి. మా విద్యా సంస్థల్లో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కౌన్సిలర్లును ఏర్పాటు చేశాం.

– **కె.వి. మణ**, శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం, విశాఖ

చదువుకుంటేనే భవిష్యత్



విద్యార్థులు బాగా చదువుకుంటేనే భవిష్యత్ ఉంటుంది. ఇదే విషయాన్ని మా విద్యార్థులకు చెబుతున్నాం. కాలేజీ అంటే అదో లోకం అనే ధోరణి వీడాలి. విద్యార్థులు చదువులపైనే శ్రద్ధ వహించాలి. ఈ విషయంలో విద్యార్థులకు మా వంతుగా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచిస్తున్నాం. చదువు విలువ తెలుసుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని విద్యార్థుల్లో చైతన్యం తీసుకొస్తున్నాం.

– **బి.స్వాతి, కౌన్సిలర్**, కేజీబీవీ, ఆనందపురం

కలలను సాకారం చేసుకోవాలి



ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకం. దీనిపై శ్రద్ధ వహించే వారు తమ కలలను సునాయాసంగా సాకారం చేసుకోవచ్చు. చదువుతో ఏదైనా సాధ్యమే. కాలేజీలకు వచ్చేశామని మితిమీరిన స్వేచ్ఛ వద్దు. కాలేజీల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, నేరుగా అధ్యాపకులతో చెప్పుకోవచ్చు. విద్యార్థులకు అండగా నిలిచేలా ప్రభుత్వ కాలేజీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం.

–**బి.రాధ**, డీవీఈవో, విశాఖ

ఘనంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టం పజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

ఉత్తమ సేవలకు అభినందన

ఎస్ఈబీ ఎస్ఐ సురేష్‌కుమార్‌కు ప్రశంసాపత్రం

పాడేరు: సార్వత్రిక ఎన్నికల్లో ఇంటిలిజెన్సీ విధులను అత్యుత్తమంగా నిర్వహించిన స్థానిక ఎస్ఈబీ ఎస్ఐ టి. సురేష్‌కుమార్ విజయవాడలోని ఎస్ఈబీ కమిషనర్ రవిప్రకాశ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. స్టేషన్ సిబ్బంది సేవలను ప్రశంసించిన ఆయన ఉత్తమ స్టేషన్ అవార్డు అందజేశారు.

ఎస్ఈబీ కానిస్టేబుల్‌కు

రంపచోడవరం: స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బీవీ రమణ బెస్ట్ ఫీల్డ్ స్టాఫ్ రోలింగ్ ట్రోఫీని మంగళగిరిలో ఎస్ఈబీ కమిషనర్ చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. విశాఖపట్నం జోన్‌లో ఈ అవార్డు రంపచోడవరం స్టేషన్‌కు రావడం గర్వకారణమని ఎస్ఈబీ సీఐ ఇంద్రజిత్ అన్నారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ రమణను అభినందించారు.



అవార్డు అందుకుంటున్న కానిస్టేబుల్ రమణ

కనకమ్మకు క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

కేజీహెచ్‌ను ఎంతో మెరుగుపరిచాం

- మరికొన్ని ఇతర ఆస్పత్రులకు రూ.18.23 కోట్ల వ్యయం
- బర్న్స్ వార్డుకు త్వరలో మరో రూ.2 కోట్లు
- ఎన్నికల్లో మీడియా సహకారం భేష్
- జర్నలిస్టు దంపతులకు అపోలోలో ఫ్రీ హెల్త్ చెకప్‌లు
- హెల్త్ కార్డుల ప్రీమియం కూడా చెల్లింపు
- మీడియాతో ఆత్మీయ భేటీలో కలెక్టర్ మల్లికార్జున


మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయని కేజీహెచ్‌ను ఎంతో మెరుగుపరిచామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. దీంతోపాటు విక్టోరియా, చెస్ట్, ఆర్సీడీ, ప్రాంతీయ కంటి ఆస్పత్రులను మరింతగా అభివృద్ధి చేయడానికి రూ.18.23 కోట్ల సీఎస్సార్ నిధులు వెచ్చించామన్నారు. త్వరలో కేజీహెచ్ బర్న్స్ వార్డుకు మరో రూ.2 కోట్లు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. జిల్లాలో రూ.10.82 కోట్లతో ప్రభుత్వ వసతి గృహాల్లో ఆధునీకీకరణ పనులు చేపట్టామన్నారు. ఇంకా జిల్లాకు ఆదాయం సమకూరే చర్యల్లో భాగంగా నాలుగు పెట్రోలియం ఔట్‌లెట్‌లను ఏర్పాటు చేశామని వివరించారు. సార్వత్రిక ఎన్నికల ముగిసిన నేపథ్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ రవిశంకర్‌తో కలిసి మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడంలో యంత్రాంగానికి జర్నలిస్టులు ఎంతో సహకరించారని కొనియాడారు. మీడియా కథనాలతో యంత్రాంగం పొరపాట్లను సరిచేసుకునే వీలు కలిగిందని, ఇందుకు జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. సమాజానికి ఎన్నో విధాలుగా సేవలందిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం తరఫున చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలువురు జర్నలిస్టులకు హెల్త్ ఇన్స్యూరెన్స్ ప్రీమియం చెల్లించామని, ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. జులై ఒకటో తేదీ నుంచి అపోలో ఆస్పత్రి ద్వారా జర్నలిస్టుతో పాటు జీవిత భాగస్వామికి కూడా ఉచితంగా వైద్య పరీక్షలు చేయించాలని నిర్ణయించామని వెల్లడించారు. అలాగే ఆగస్టు నుంచి జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ ప్రీమియం రెన్యూవల్ కూడా ఉచితంగా చేయిస్తామన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుపై సానుకూల నిర్ణయం తీసుకున్నామని, కొత్త ప్రభుత్వ విధానాలకనుగుణంగా ఈ ప్రక్రియకు సంబంధించి కార్యాచరణ రూపొందించి ముందుకెళ్తామని తెలిపారు. సంజీవని నిధి ద్వారా అవసరమైన వారికి ఆర్థిక సాయం అందించామని గుర్తు చేశారు. జర్నలిస్టులు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు.

మీడియాది ప్రశంసనీయ పాత్ర

సార్వత్రిక ఎన్నికల్లో మీడియా ప్రశంసనీయ పాత్ర పోషించిందని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా మీడియా పలు కథనాలు ప్రచురించిందని, యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిందని గుర్తు చేశారు. జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రక్రియపై అన్ని వర్గాల నుంచి ప్రసంశలు లభించాయని, పోలీస్ శాఖ నుంచి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టామని, శాంతిభద్రతలను పరిరక్షించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శేష శైలజ, అఖిల, సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల ఔదార్యం


శ్రీకాంత్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

పాడేరు : ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన లగిసపల్లి గ్రామ వలంటీర్ కుటుంబసభ్యులకు అతని స్నేహితులు అండగా నిలిచారు. లగిసపల్లి గ్రామంలో పది రోజుల క్రితం తలారి శ్రీకాంత్ అనే గ్రామ వలంటీర్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన సంగతి తెలిసిందే. గ్రామంలో శుక్రవారం జరిగిన శ్రీకాంత్ సంస్మరణ కార్యక్రమంలో మృతుడి స్నేహితులైన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్, నాయకుడు జనపరెడ్డి రమణ, ఇతర మిత్రులు కలిసి పాల్గొన్నారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. స్నేహితులంతా కలిసి సేకరించిన నగదును మృతుడు శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

విద్యుత్ షాక్‌తో ఐదు పాడిగేదెలు మృతి


మృతి చెందిన పాడిగేదెలు

ఎటపాక: మండల పరిధిలోని కొల్లుగూడెం గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి ఐదు పాడిగేదెలు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి జరిగింది. పురుషోత్తపట్టణం గ్రామానికి చెందిన గార్లపాటి శాంతారావు, రామారావు ,శ్రీపతి రైతులకు చెందిన గేదెలు మేతకు గ్రామ శివారుకు వెళ్లాయి. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైరుకు కరెంట్ సరఫరా కావడంతో ఆ వైరుకు తగిలిన ఐదు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.5లక్షలు ఉంటుందని రైతులు తెలిపారు. జీవనాధారమైన పాడిగేదెలు మృతి చెందడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

వైద్యాధికారి పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏయూక్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో ఓఎస్ థెరపీ కేంద్రంలో కాంట్రాక్టు విధానంలో వైద్యాధికారి పోస్టు భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ రామిరెడ్డి తెలిపారు. ఈ నెల 14వ తేదీలోగా తమ దరకాస్తులను ప్రభుత్వ మానసిక ఆసుపత్రి సూపరింటిండెంట్ కార్యాలయంలో అందించాలని సూచించారు. పూర్తి వివరాలకు www.visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

మోదమ్మ జాతరలో జాగ్రత్తలు తప్పనిసరి

పాడేరు సీఐ నవీన్‌కుమార్


మాట్లాడుతున్న పాడేరు సీఐ నవీన్‌కుమార్

పాడేరు : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు శ్రీ మోదకొండమ్మ తల్లి జాతరకు వచ్చే భక్తులు, ప్రజలు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని పాడేరు సీఐ నవీన్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఎస్ఐ లక్ష్మణరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకు నిర్వహించే జాతరకు పలు ఆంక్షలు విధించామన్నారు. మూడు రోజుల పాటు ఏజెన్సీ ప్రాంతంలో పెద్ద వాహనాలకు ఎటువంటి అనుమతి లేదన్నారు. మూడు రోజుల పాటు ప్రభుత్వ మద్యం షాపులు మూసివేస్తామని చెప్పారు. నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని ఎవరైన మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జాతరకు వచ్చే భక్తులు, ప్రజలు తమ విలువైన వస్తువులను జాగ్రత్తలు చూసుకోవాలన్నారు. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాల సమయం కుదించామని చెప్పారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని చెప్పారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా

- ముంచంగిపుట్టు, పెదబయలు, అరకు, హుకుంపేట మార్గాల నుంచి వచ్చే వాహనాలు అడారిమెట్ట జంక్షన్ మీదుగా వంతాడపల్లి చెక్ పోస్ట్ దరి విశాఖపట్నం, జి.మాడుగుల ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.
- జి. మాడుగుల ప్రాంతం వైపు నుంచి విశాఖపట్నం, అరకు, పెదబయలు మార్గాల వైపు వెళ్లే వాహనదారులు గొందూరు సెయింటాన్స్ పాఠశాల నుంచి నక్కనలపుట్టు,వంతాడపల్లి చెక్‌పోస్టు మీదుగా వెళ్లాలని సూచించారు.
- విశాఖపట్నం నుంచి అరకు, పెదబయలు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు వంతాడపల్లి చెక్ పోస్టు నుంచి అడారిమెట్ట మీదుగా వెళ్లాలని ఆదేశించారు.
- విశాఖపట్నం నుంచి జి. మాడుగుల ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలు నక్కలపుట్టు నుండి గొందూరు సెయింటాన్స్ స్కూల్ మీదుగా వెళ్లాలని సూచించారు.
- వాహనదారులకు ఆయా చోట్ల కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

గాం గంటం దొరకు నివాళి


గాం గంటం దొర చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గిరిజన భవన్ ఉద్యోగులు

కొమ్మాది (విశాఖ): రుషికొండ బీచ్‌రోడ్డులో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ భవన్‌లో గిరిజన సమరయోధుడు గాం గంటం దొర శత వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గంటం దొరకు భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చినబాబు సిబ్బందితో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం గంటం దొర పోరాటాలు చేశారని అన్నారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలోనూ గంటం దొర కీలక పాత్ర పోషించారన్నారు.